# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 10-08-2016**

ఈ ఏడాది దసరా పండుగ నుంచే కొత్త జిల్లాలు మనుగడలోకి రావాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. ఆలోగానే అధికార ప్రక్రియలన్నింటినీ ముగించాలని సిఎం చెప్పారు. ఈ నెల మూడో వారంలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేయాలని కూడా నిర్ణయించారు. తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించాలని అధికారులకు చెప్పారు. జిల్లాల ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల నుంచి సమాచారం సేకరించడంతో పాటు ఇప్పటి వరకు వచ్చిన ప్రతిపాదనలపై చర్చించి ప్రభుత్వానికి తుది నివేదిక ఇవ్వడానికి కేబినెట్ సబ్ సమిటీని కూడా ముఖ్యమంత్రి నియమించారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి వెంటనే మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

కొత్త జిల్లాల ఏర్పాటుపై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ఆర్ అండ్ బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ శేరి సుభాష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రేమండ్ పీటర్, ప్రదీప్ చంద్ర, ఎస్.కె. జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణా రావు, న్యాయశాఖ కార్యదర్శి సంతోష్ రెడ్డి, అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి, సిఎంఓ ముఖ్య కార్యదర్శి సి. నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఇప్పటి వరకు జరిగిన అధ్యాయనాన్ని ఈ సమావేశంలో చర్చించారు. ప్రజల నుంచి, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, వాటిని అన్ని కోణాల

నుంచి పరిశీలించిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, జనాభా భౌగోళిక అంశాలను దృష్టిలో పెట్టుకొని వచ్చిన కొత్త జిల్లాల ప్రతిపాదనలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాజకీయ డిమాండ్లను పెద్దగా పట్టించుకోకుండా ప్రజలకు సౌకర్యం, పరిపాలన సౌలభ్యం, భౌగోళిక నేపథ్యం, వెనుకబాటుతనం తదితర అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ నెల 22 ప్రాంతంలో కొత్త జిల్లాలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిఎం చెప్పారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై అన్ని అంశాలను అధ్యయనం చేయడానికి కేబినెట్ సబ్ కమిటీని ముఖ్యమంత్రి నియమించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అధ్యక్షతన మరో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీ హరి, మంత్రులు ఈటెల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. వీలైనంత త్వరలో నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కు ముందే కేబినెట్ సమావేశం, అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత నెల రోజుల సమయమిచ్చి ప్రజల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించాలని చెప్పారు. తర్వాత పక్షం రోజుల్లో వాటిని పరిష్కరించి తుది ప్రకటన చేయాలని సిఎం ఆదేశించారు.

దసరా నుంచి కొత్త జిల్లాలు మనుగడలోకి రానున్నందున అధికారుల విభజన, కార్యాలయాల సంసిద్ధత తదితర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కొత్త జిల్లాలలో అధికార యంత్రాంగం ఎలా ఉండాలి? న్యాయాధికార పరిధి ఏ మేరకు ఉండాలి? అధికార వ్యవస్థ ఎలా ఉండాలి? తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. జోనల్ సమస్యలు అధిగమించడానికి అనుసరించాల్సిన వ్యూహం కూడా ఖరారు చేయాలని సిఎం ఆదేశించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**